క్లుప్తంగా

కదిలిన విద్యుత్ శాఖ అధికారులు


మక్కెనవారిపాలెంలో వెలిగిన లైట్లు

సాక్షి ఎఫెక్ట్..

సంతమాగులూరు (అద్దంకి రూరల్): అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో చీకట్లు కమ్ముకున్నాయన్న కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. సోమవారం సాక్షి దినపత్రికలో అంధకారంలో మక్కెనవారి పాలెం కథనం ప్రచురించింది. దీనికి విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో వెలగని లైట్లు తీసి కొత్తవి వేసి చీకట్లు పారదోలారు. తమకు సమస్యను ప్రచురించి సమస్యను పరిష్కరించేలా చేసిన సాక్షికి విద్యార్థులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

లెక్కల పరీక్షకు ముగ్గురు గైర్హాజరు

చినగంజాం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో ముగ్గురు గైర్హాజరైనట్లు ఎంఈవో బీ అజయ్‌బాబు తెలిపారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 417 మంది పరీక్షలు రాస్తుండగా వారిలో సోమవారం నిర్వహించిన లెక్కల పరీక్షకు ముగ్గురు గైర్హాజరు కాగా 414 మంది హాజరయ్యారని ఆయన వివరించారు. ఇంకొల్లులో మండలంలోని ఐదుగురు విద్యార్థులు గైర్హాజరు ఎంఈఓ తెలిపారు. మండలంలో మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలలో 798 మంది పరీక్ష రాస్తుండగా సోమవారం 793 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. పర్చూరు మండలంలో 16 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. మొత్తం మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో 672 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 16 మంది గైర్హాజరు కావడంతో 656 మంది హాజరయ్యారని ఆయన వివరించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతమాగులూరు (అద్దంకి): సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులోని కస్తూరిబా గురుకుల బాలికల కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు, 7, 8, 9, 10, 12వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. https://apkgbv.apcfss.in సైట్‌లో వచ్చే నెల 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనాథలు, బడి బయటి పిల్లలు, పేద ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెజేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. అవకాశాన్ని అర్హులైన బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడో తరగతిలో ఒకటి, ఎనిమిదిలో మూడు, తొమ్మిదితో రెండు, పదిలో నాలుగు, 12లో ఏడు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

పీఎం అజయ్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

చీరాల: పీఎం అజయ్ పథకాన్ని స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెలుగు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకం కింద చీరాల నియోజకవర్గంలోని 12 మంది స్వయం సహాయక సంఘాల్లో ఎస్సీ లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీతో కూడిన ఉన్నతి వడ్డీ లేని రూ.20 లక్షల రుణాన్ని ఆయన లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో డీపీఎం సుబ్బారావు, ఏపీఎంలు ఫణి, మధుసూదన్ రావు, అంజిబాబు పాల్గొన్నారు.

రేపు పర్చూరులో జాబ్ మేళా

పర్చూరు(చినగంజాం): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ పర్చూరులోని మారుతీ ఐటీఐ కళాశాలలో గోదావరి, ఆంధ్ర కోఆపరేటివ్ సొసైటీ, ఎస్ఎస్ఎల్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు గోదావరి, ఆంధ్ర కోఆపరేటివ్ సొసైటీ, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఇండో సోలార్, ఆవిష్కరణ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. వీటిలో 100కు పైగా ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. జీతం విద్యార్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.15 వేలు వరకు ఉంటుందన్నారు. మేళాకు పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా విభాగాల వరకు చదువుకొని 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరవచ్చన్నారు. బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలు, జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 63027 64962 నంబర్‌ను సంప్రదించాలని, వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

ఏదీ ? ఆనాటి వెలుగుల జిగేల్


నాడు అద్దంకి పట్టణంలో వెలుగులు విరజిమ్ముతున్న లైట్లు (ఫైల్)


నేడు అద్దంకిలో స్తంభాలకు కనిపించని ఎల్ఈడీ ధగధగలు

- సుందర అద్దంకి లక్ష్యానికి తూట్లు
- కూటమి ప్రభుత్వంలో వెలగని లైట్లు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుందర పట్టణంగా అద్దంకి
- నామ్‌హైవే డివైడర్ల మీద 3 కిలోమీటర్ల మేర విద్యుత్ స్తంభాలకు లైట్లు
- పట్టించుకోని అధికారులు

అద్దంకిరూరల్: స్వచ్ఛ పట్టణాలే లక్ష్యం.. రాష్ట్రంలో ఉన్న మున్సిపాలిటీలు అన్నీ సుందరంగా తీర్చిదిద్దుతాం అని కూటమి నాయకులు ప్రగల్భాలు పలికారు. కాని అధికారంలోకి వచ్చాక వాటి ఊసే లేకుండా నిద్ర నటిస్తున్నారు. అది చేస్తాం.. ఇది చేస్తాం అని బూటకపు మాటలు.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి పాలనను గాలికొదిలేసి చోద్యం చూస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కాంతులతో అద్దంకి పట్టణం అంతా వెలుగు చిమ్మితే నేడు వెలగని లైట్లతో పట్టణం కళాకాంతులు లేక చీకట్లలో మగ్గుతోంది. గతంలో అద్దంకి పట్టణం నామ్ రహదారి డివైడర్ల పైన, పట్టణంలోని ప్రధాన రహదారుల పైన విద్యుత్ లైట్లు, స్తంభాలకు అలంకరణ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణమంతా విద్యుత్ కాంతులు విరజిమ్ముతూ చీకట్లు పారదోలి వెలుగు విరజిమ్మాయి. నేడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పట్టణంలోని వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల నిర్వహణ పట్టించకోకపోవడంతో లైట్లు వెలగక పట్టణమంతా కళావిహీనంగా మారింది. నాడు రాత్రి సమయాల్లో అద్దంకి వచ్చిన బయట ప్రాంతాల వారు, అద్దంకి మీదుగా హైదరాబాద్, చెన్నై నగరాలకు వెళ్లేవారు ఇది చూసి ఆనందం వ్యక్తం చేసేవారు. తమ ఊరి అభివృద్ధిని, దానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. నాడు జిల్లాలో సుందర పట్టణంగా విరాజిల్లిన అద్దంకిని నేడు ఈ దుస్థితిలో చూసి బాధపడుతున్నారు.

హైవేపై 3 కిలో మీటర్ల మేర వెలుగుల జిగేలు..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో అద్దంకిలోని రోడ్ల వెంట ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టారు. దీంతో రోడ్డు మధ్య డివైడర్లు విద్యుత్ స్తంభాల ఏర్పాటుతో అలంకరణ విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేశారు. నామ్ హైవేపై స్థానిక నల్లవాగు బ్రిడ్జి నుంచి, శింగరకొండ వెళ్లే దారి 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వరకు 3 కిలో మీటర్ల పొడవున అలంకరణ లైట్లతో సుందర అద్దంకిగా మార్చారు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు..

సాక్షాత్తు విద్యుత్ శాఖ మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న అద్దంకి పట్టణం సుందరీకణల వెనుకబడింది. పట్టణ సుందరీకరణ కోసం ఏర్పాటు చేసిన లైట్లు వెలగకపోయిన సంబంధిత విద్యుత్‌శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు పట్టించుకోకుండా రోజూ వీధుల వెంట తిరుగుతున్నారు. అద్దంకి పట్టణాభివృద్ధికి కృషిచేస్తామని సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పే నాయకులు 'గ్రీన్ అద్దంకి-సుందర అద్దంకి' లక్ష్యాన్ని నీరుగార్చారు. సుందరీకరణకు ఎటువంటి చర్యలు చేపట్టకుండా లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

1.20 కోట్లతో స్తంభాలకు ప్రత్యేక.. లైట్ల ఏర్పాట్లు..

2022లో వైస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అద్దంకి పట్టణం సుందరీకరణలో భాగంగా రూ. 1.20 కోట్ల నిధులు మంజూరు చేశారు. పట్టణంలోని నామ్ హైవేపై నల్లవాగు బ్రిడ్జి నుంచి శింగరకొండ దారిలోని 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వరకు, పట్టణంలో బంగ్లారోడ్, మెయిన్‌రోడ్, దర్శిరోడ్డు డివైడర్లపై సెంటర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుతో వాటి చుట్టూ డెకరేషన్ లైటింగ్ ఏర్పాటు చేసి సుందరీకరణ చేశారు.

> **దాతలు సహకరిస్తే లైట్లు ఏర్పాటు చేస్తాం..**
>
> గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్తంభాల చుట్టూ సందరీకరణకు సుమారు రూ. 6 లక్షల వరకు ఖర్చు అయ్యింది. అవి కాలక్రమేణ పాడైపోయాయి. వాటి తిరిగి ఏర్పాటు చేయాలంటే ఇప్పుడు సుమారు రూ. 10 లక్షల వరకు ఖర్చుఅవుతుంది. దాతలు ఎవరైన ముందుకు వచ్చి సహకరిస్తే ఏర్పాటు చేస్తాం. నామ్ హైవేపై లైట్లు మాత్రం హైవే అధికారులే కరెంట్ చార్జి ఎక్కువ అవుతుందని కనెక్షన్‌లు కట్ చేశారు.
>
> – డీ. రవీంద్ర, అద్దంకి మున్సిపల్ కమిషనర్


రైలు దిగి ఎత్తైన ప్లాట్ ఫాం ఎక్కి వస్తున్న ప్రయాణికులు


ప్లాట్ ఫాం దూరం కావడంతో పాకుతున్న వృద్ధ మహిళ

ప్లాట్‌ఫాం లేక అవస్థలు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- వృద్ధులు, మహిళలు రైలు దిగి రావాలంటే నరకమే

చినగంజాం: ప్రస్తుత ప్రభుత్వాల్లో బస్‌స్టాండ్‌లు ఏవిధంగా ఉన్నాయో.. రైల్వే స్టేషన్లు అలానే తయారయ్యాయి. చినగంజాం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్ ఒకటిలో రైలు దిగిరావాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అందుకు కారణం ఇటీవల స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ప్లాట్‌ఫాం నంబర్ ఒకటిని దూరంగా నిర్మించడమే. ప్లాట్‌ఫాం నంబర్ 1లోకి బండి వచ్చినప్పుడు ప్రయాణికులు అంతా బండి దిగాలంటే రెండో నంబర్ ఫ్లాట్ ఫారం దిగి రావాల్సిందే. ప్లాట్‌ఫాం 2 లో రైలు దిగితే కచ్చితంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కి దిగిరావడం కష్టంగా ఉండటంతో ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితిలో ప్లాట్‌ఫాం-1 వైపు దిగి కిందనుంచి పైకి ఎక్కి వస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో నుంచి బయటకు రావాలంట ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నంబర్ ద్వారా దగ్గర దారి కావడంతో ప్రయాణికులు దానినే ఆశ్రయిస్తున్నారు.

జారిపడుతున్న మహిళలు, వృద్ధులు

రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నంబర్ నుంచి స్టేషన్ బయటకు వచ్చేందుకు మహిళలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. రైలు దిగి వచ్చే సమయంలో రైలు ట్రాక్ పక్కన గులక రాళ్లు ఉండటంతో జారిపడి గాయాల పాలవుతున్నారు. వృద్ధులు అయితే పాక్కుంటూ వస్తుండటం చూపరులను కలచి వేస్తుంది. ఇటువంటి ఘటనలు చినగంజాం రైల్వే స్టేషన్‌లో ప్రతినిత్యం దర్శనమిస్తున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. మాకు ఆదాయం వస్తే చాలులే అనే ధోరణిలో వారున్నారే తప్పా.. ప్రయాణికుల అవస్థలు గమనించడం లేదు.

ఒకటో ప్లాట్‌ఫాం అనుకూలంగా ఏర్పాటు చేయాలి

చినగంజాం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం 1ని ప్రయాణికులకు అనుకూలంగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైలు దిగి బ్రిడ్జి ఎక్కి రావడం కన్నా ఇదే దగ్గర దారిగా భావించి ప్రయాణికులు ఇటువైపు నడుస్తున్నారు. గులకరాళ్లపై గుండా నడుస్తూ మళ్లీ తిరిగి ఎత్తైన ప్లాట్‌ఫాం ఎక్కడమంటే చాలా కష్టంగా ఉందంటున్నారు. రైలు దిగి వచ్చే మహిళలకు అనుకూలంగా ఉండేలా చేస్తే ప్రయాణికులు రద్దీ పెరిగి స్టేషన్‌కు ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం


సాహిత్య పుస్తకాలు అందిస్తున్న సమితి సభ్యులు

చీరాల అర్బన్: పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మరింత విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు టీ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో తెలుగు భాషోద్యమ సమితి తిరుపతి వారి సహకారంతో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మురళి అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థినులు ఉద్యోగ సాధనకు ప్రణాళికాబద్ధంగా ఏ విధంగా చదవాలనే అంశాలను వివరించారు. అలానే ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థినుల పాత్ర, స్త్రీ విద్య ప్రాముఖ్యతను వివరించారు. అలానే తెలుగు భాషోద్యమ సమితి తరుపున కళాశాలలోని గ్రంథాలయానికి వివిధ సాహిత్య పుస్తకాలను వితరణ చేశారు. కన్నవారి ప్రేమను చిత్రించిన కథ 'అంపకం' ప్రతిని విద్యార్థినులకు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘ మాజీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుత ఉపాధ్యక్షులు టి.నరసింహులు, వెంకటకృష్ణయ్య, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, సోము రవికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.నీలా కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించాలి


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని కొత్తపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని పంచాయతీ కార్యాలయంలో సోమవారం పీ-4 సర్వేపై గ్రామ కార్యదర్శి బాబు రావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఇటీవల నిర్వహించిన సర్వేలో పేదరికంలో ఉన్న 163 కుటుంబాలను గుర్తించారని వారిలో ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి గ్రామసభ ద్వారా తమ అభ్యంతరాలను తెలియజేయాలన్నారు. సర్వే వివరాలను కంప్యూటరీకరిస్తున్న సందర్భంగా ఈ గ్రామ సభ నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు ఆయన వివరించారు. గ్రామంలో కుటుంబాల్లో ఉద్యోగస్తులు, 5 ఎకరాలకు మించి పొలం, కారు ఉన్న వారు, ఇతర ఆదాయ మార్గాలు ఉన్న వారిని గుర్తించి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఎప్పుడు ఇస్తారు ?


మార్టూరులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు


చీరాల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

చీరాల టౌన్: అందరికీ ఇళ్లు, సంక్షేమ పథకాలు అందిస్తాం.. సంపదను పెంచి పేదలకు పంచుతామని ఊకదంపుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సూపర్ సిక్స్ పక్కాగా అమలు చేయాలని, రేషన్ కార్డులు అందరికీ ఇవ్వాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలో పేదలు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ ప్రాంతీయ కార్యదర్శి ఎస్.బాబూరావు, ఎం.వసంతరావు, జయరాజ్‌లు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, రూరల్ గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్లస్థలాలు ఇచ్చి హామీ నెరవేర్చుకోవాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయిస్తూ లబ్ధిదారుల జాబితా కూడా ప్రకటిస్తే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ఆ జాబితాను కనిపించకుండా చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి హయాంలో మున్సిపల్ పరిధిలో అర్హులైన వారికి స్థలాలు ఇస్తున్నామని చెప్పి వారికి పొజిషన్ చూపించకుండా మోసాలకు గురిచేశారన్నారు. అనంతరం తహశీల్దార్ కే గోపికృష్ణకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, ప్రసాద్, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వరరెడ్డి, సాంబయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మార్టూరులో..

మార్టూరు: దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తమ ఇళ్లకు తహసీల్దార్ పట్టాలు మంజూరు చేయాలని మార్టూరు రామ్ జనార్దన్ కాలనీకి చెందిన యానాదులు కోరారు. మండల సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో కాలనీవాసులు ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో తహసీల్దార్ టీ. ప్రశాంతికి వినతి పత్రం అందజేశారు. సుమారు 30 ఏళ్లుగా కాలనీలో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న తాము పంచాయతీకి ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లించుకుంటూ, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో పాటు ఓటర్ కార్డులు కలిగి ఉన్నా తమకు అధికారికంగా పట్టాలు మంజూరు చేయలేదని వాపోయారు. కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి ఎనిక పాటి రాంబాబు, మండల కన్వీనర్ బత్తుల హనుమంతరావు, కాలనీవాసులు నక్క చిన్న అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాలెడ్జ్ సెంటర్ విద్యార్థులకు ఉపయోగం


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అద్దంకి: కళాశాలలో నిర్వహిస్తున్న జవహర్ నాలెడ్జ్ సెంటర్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కట్టా రామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వీ మోహనరావు అన్నారు. సోమవారం కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ట్రెనింగ్ సెంటర్‌లో విద్యార్థులు, వివిధ కోర్సులకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఇంగ్లిషుతోపాటు, రీజనింగ్ వివిధ రకాల ఉద్యోగాలకు ఉపయుక్తమయ్యే అంశాల్లో ట్రెనింగ్ ఉంటుందని చెప్పారు. గ్రాండ్ టెస్ట్‌ల ద్వారా నైపుణ్యాన్ని పరీక్షించి సర్టిఫికెట్‌లు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ షర్మిళ, మెంటార్ వినుకొండ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రిసార్ట్స్‌లను తనిఖీ చేసిన ట్రైనీ డీఎస్పీ


రిసార్ట్స్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్

చీరాల: చీరాల వాడరేవు, రామాపురంలోని బీచ్ రిసార్ట్స్‌లో సోమవారం రాత్రి ట్రైనీ డీఎస్పీ అభిషేక్ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు రిసార్ట్స్‌ను తనిఖీ చేశారు. రిసార్ట్స్‌కు వచ్చే వారి వివరాలను, రికార్డులు పరిశీలించారు. రిసార్ట్స్‌కు వచ్చే వారి వివరాలను, ఫొటో ఐడీలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

జాగ్రత్తలతో క్షయ నివారణ


స్వర్ణలో టీబీ వ్యాధిపై ప్రతిజ్ఞ చేస్తున్న సచివాలయ, వైద్య సిబ్బంది

కారంచేడు: మన ఊరి నుంచి, మన జిల్లా, మన రాష్ట్రం, మన ప్రాంతం నుంచి క్షయ వ్యాధిని తరిమి కొడదామని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్మప్రియలు పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ (టీబీ) నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని హైస్కూల్ సెంటర్, మెయిన్ రోడ్, ఉత్తర బజారు సెంటర్‌ల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, కార్యదర్శి చక్రవర్తి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: కలిసికట్టుగా క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని మార్టూరు టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రం మార్టూరు స్టేట్ బ్యాంక్ సెంటర్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

చీరాల రూరల్: క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని క్షయవ్యాధి అంటువ్యాధి వంటిదని అది ఒకరి నుండి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుందని పలువురు వైద్యులు పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం టీబీ యూనిట్ చీరాల ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది వర్షధార, శ్రీలక్ష్మి, రియాజ్, హరికాంత్, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ప్రభుత్వాసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కేంద్రాల పరిశీలన

చీరాల అర్బన్: సమితిత విద్య కేంద్రాలను రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కో ఆర్డినేటర్ మల్లికార్జునరావు సోమవారం పరిశీలన చేశారు. చీరాల మండలం ఈపూరుపాలెం భావనారుషిపేటలోని సమితిత కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన 17 మంది చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వారం క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ అందించాలన్నారు. ఆయన వెంట ఐఈ జిల్లా సమన్వయకర్త ఎం.జ్యోత్స్న, ఐఈఆర్టీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన హైవే అంబులెన్స్


పెట్రోలింగ్ వాహనాన్ని తోస్తున్న సిబ్బంది

బల్లికురవ: హైవేలో ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులను వైద్యానికి తరలించే వాహనానికి కష్టాలు ఆరంభమయ్యాయి. సోమవారం మేదరమెట్ల-అద్దంకి నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని వైదన బస్టాప్ వద్ద హైవే అంబులెన్స్ పెట్రోలింగ్ వాహనం మొరాయించటంతో నెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎంత నెట్టినా స్టార్ట్ కాకపోవటంతో వైదన క్రాస్‌రోడ్ వద్ద నిలిపివేశారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు అవార్డులు


డీఎంహెచ్‌వో చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకుంటున్న షేక్ అబ్దుల్ సత్తార్, రాజశేఖర్


అవార్డు అందుకున్న వెంకటేశ్వర్లు

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కే వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో విజయమ్మ చేతుల మీదుగా అవార్డు పొందడం అభినందనీయమని వైద్యాధికారులు షేక్ రమీజ్ అహమ్మద్, జీ. రవితేజ కొనియాడారు. సోమవారం ప్రపంచ టీబీ డే సందర్భంగా వెంకటేశ్వర్లు అవార్డును అందుకున్నారు. టీబీ పరీక్షలు మైక్రోస్కోప్ ద్వారా నెలకు 150 వరకు చేసి 4 నుంచి 6 పాజిటివ్ కేసులతో వైద్యం అందించడం పట్ల వైద్యాధికారులను అభినందించారు. అభినందించిన వారిలో వైద్యాధికారులు భారతి, మమత, వైద్య సిబ్బంది, ఉన్నారు.

అద్దంకి రూరల్: ఉత్తమ ఆరోగ్య పర్యవేక్షకుడిగా షేక్ అబ్దుల్ సత్తార్, అద్దంకి టీబీ యూనిట్‌లో పని చేస్తున్న బీ. రాజశేఖర్, ఉత్తమ సీనియర్ టెక్నికల్ సూపర్‌వైజర్‌గా జిల్లా వైద్యాధికారిచే ప్రశంస పత్రాలు అందుకున్నారు.

యువకుడికి గాయాలు

మార్టూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఓ యువకుడు గాయపడిన ఘటన సోమవారం రాత్రి స్థానిక జాతీయ రహదారిపై ఇసుకదర్శి సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. చీరాల సమీపంలోని బుర్లవారిపాలెం గ్రామానికి చెందిన చైతన్య ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తుంటాడు. మండలంలోని వలపర్ల గ్రామంలో వసూళ్ల కోసం వచ్చిన చైతన్య తిరిగి చీరాల వెళ్లే క్రమంలో ఇసుకదర్శి ఫ్లైఓవర్ ఎక్కే సమయంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని కిందపడి గాయపడ్డాడు. సమాచారం తెలిసిన హైవే అంబులెన్స్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అతని బంధువులు చీరాల ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

యానాది ప్రజలను ఆదుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

చీరాల రూరల్: నియోజకవర్గంలో నివాసం ఉంటూ ఎటువంటి ప్రభుత్వ పథకాలకు నోచుకోకుండా దుర్భర జీవితాలను అనుభవిస్తున్న యానాది సామాజిక ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని చీరాల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల అర్హత కోసం వయసు నిర్ధారణ సర్టిఫికెట్ల కోసం సోమవారం సాధన సమితి ఆధ్వర్యంలో యానాది సామాజిక ప్రజలు ప్రభుత్వ వైద్యులను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు శీలం రవికుమార్, ఊటుకూరి వెంకటేశ్వర్లు మాట్లాడారు. చీరాల పరిసర ప్రాంతాలైన బుర్లవారిపాలెం, తోటవారిపాలెం, ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ కాలువలపై పట్టణ ప్రాంతాలలో యానాదులు నివాసముంటున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందజేయాలని వారు కోరారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

అద్దంకి రూరల్: నిరుపేద గిరిజనులు ఇంటి నివేశన స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌లో తహసీల్దార్, ఎంపీడీవోలకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని శింగరకొండ పాలెంలో ఎస్టీ యానాది కులానిక చెందిన పేదలు గత 15 ఏళ్లుగా అద్దంకికొండ, శింగరకొండ దిగువ ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. వారు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు పట్టాలు మంజూరు చేయాలన్నారు.